# తప్పు చేశా

ఒక్కసారిగా చందూ నాకు దూరమైపోయినట్లని పించింది.

నేనీ మధ్య సరిగ్గా గమనించలేదు కానీ ముభావంగా ఉంటున్నాడు. ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం ఫోన్ చేసేవాడు. "ఎలా ఉన్నావని" పలకరించేవాడు.

"అయినా చందూ! నీ పిచ్చిగానీ ఒక్కపూటలో నేనేమైపోతానని" అనేదాన్ని నేను.

అలాంటిది ఫోన్ కూడా చేయడం లేదు. ఒక వేళ చేసినా ఏదో పొడిగా రెండు ముక్కలు మాట్లాడి పెట్టేస్తున్నాడు.

భౌతికంగా నా నుంచి దూరంగా ఉన్నా మాన సికంగా ఎప్పుడూ నా చుట్టూనే తిరుగుతుండే వాడు.

చందూకి నా మీద ప్రేమ తగ్గిపోయిందా?

* * *

డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో పరిచయమయ్యాడు చందూ. పీజీ వరకూ ఇద్దరం కలసి చదువు కున్నాం.

అతనిది విచిత్రమైన మనస్తత్వం. తనకేం కావాలన్నా ఎదుటివాళ్లను అడగడు. అతని అవస రాలను ఎదుటి వాళ్లే గ్రహించాలనుకుంటాడో ఏమో.

మూడేళ్ల స్నేహంలో అతను నాకెప్పుడూ 'ఐ లవ్ యూ' చెప్పలేదు. తనకి నా మీద అపారమైన ప్రేముందని తెలుసు. అయినా తన ప్రేమని ఏ రోజైనా వ్యక్తం చేస్తాడేమోనని ఎదురుచూసి చిరాకు పడ్డ సంద ర్భాలు కూడా ఉన్నాయి.

చివరికి నా నోటితోనే ఐ లవ్ యూ చెప్పించుకు న్నాడు.

నా కోసం దేన్నయినా వదులుకోడానికి సిద్ధపడేంత ప్రేమ తనది. అతనికి నేనొక అపురూపం.

పోస్ట్ గ్రాడ్యుయేషన్ తర్వాత నేను రెండేళ్లు ఖాళీ గానే ఉన్నాను. చందూకి చాలా ఆఫర్‌లు వచ్చాయి. ఫారిన్ చాన్స్ కూడా వచ్చింది.

విషయం నాతో చెప్పి అభిప్రాయమడిగాడు.

నేను వెళ్లమనీ చెప్పలేదు. వద్దనీ చెప్పలేదు. మౌనంగా ఉండిపోయాను.

చందూ కెరీర్‌ను పాడుచేస్తున్నానేమో అని ఒక్క క్షణం అనిపించినా తనను విడిచి ఉండలేని బలహీనత



నా గొంతును నొక్కేసింది.

నా మౌనం వెనుక దాగున్న భావాన్ని అతను గ్రహిం చగలిగాడో ఏమో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. ఆ తర్వాత ఓ కార్పొరేట్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాడు.

చందూ సమక్షంలో గంటలు సహితం నిమిషాల్లా దొర్లిపోయేవి.

నాకు చాలా గర్వం వేసేది. ఏ ఆడపిల్లకైనా తన ప్రియుడికి తనే సర్వస్వమవ్వడానికి మించిన అదృష్టం మరేముంటుందని పొంగిపోయేదాన్ని.

అనుకోకుండా నేను గ్రూప్ వన్ సర్వీసెస్‌కి సెలక్ట య్యాను. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

డ్యూటీలో జాయిన్ అయిన తరువాత క్షణం తీరి కుండేది కాదు. చందూని సరిగ్గా పట్టించుకోలేదు. నేను గమనించే సరికల్లా అతనెక్కడున్నాడో కూడా తెలియ నంత దూరం మా మధ్యకు వచ్చేసింది.

* * *

కాలం కదిలిపోతోంది.

హోదా పెరిగింది. డెప్యూటీ కలెక్టర్‌న య్యాను.

బిజీ లైఫ్. ఎవరి గురించీ ఆలోచించే తీరిక లేని ఉద్యోగం.

చందూ గుర్తుకొచ్చాడు. గుండెలు పిండేసిన ట్లనిపించింది.

ఏ వ్యాపకం లేకుండా లీజర్‌గా ఉన్నప్పుడు చందూ కావాలనుకునేదాన్ని. తను ఎంతో దూరం నుంచి నా కోసం వస్తే కనీసం తనతో మాట్లాడే తీరికుండేది కాదు నాకు.

నాకు బోర్ కొట్టినప్పుడు కాలక్షేపం కోసమే చందూ సమక్షాన్ని కోరుకునేదాన్నేమో.

మొట్టమొదటిసారి నా ప్రేమ మీద నాకే అనుమానమొచ్చింది.

నా ప్రవర్తనే చందూని నా నుంచి దూరం చేసిందేమో.

చందూ కెరీర్ గురించి ఆలోచించని నేను, నా విషయానికి వచ్చేసరికి కెరీర్ ముఖ్యమని చందూని వదిలి దూరంగా వచ్చేశాను. నాది స్వార్థం కాక మరేంటి?

నా హోదాతో ఈ రోజున ఆస్తి, అంతస్తు ఉన్న భర్తను కొనుక్కోగలను. కానీ చందూలాంటి ప్రేమికుడ్ని కొనుక్కో లేనుగా.

జీవితంలో మొట్టమొదటిసారిగా తప్పుచేశానన్న ఫీలింగ్. కళ్లు చెమర్చాయి.

**-పి.ఎస్.ఎస్.రెడ్డి (చిక్కవోలు)**




